క్లుప్తంగా

వీఎల్ డయాగ్నొస్టిక్స్ సెంటర్ ప్రారంభం



నెల్లూరు(అర్బన్): పొగతోటలో వీఎల్ డయాగ్నొస్టిక్స్ సెంటర్‌ను ఎస్బీఐ ఆర్ఎం శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రిచ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ రవికుమార్ మాట్లాడారు. అల్ట్రా సౌండ్, సీటీ స్కానింగ్, డిజిటల్ ఎక్స్‌రే, అన్ని రకాల రక్త పరీక్షలను తక్కువ ధరకే చేసేలా డయాగ్నొస్టిక్స్ సెంటర్‌ను ప్రారంభించడం సంతోషకరమన్నారు. డాక్టర్ భాస్కర్, రిచ్ ఆస్పత్రి మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొడవలూరు: మండలంలోని గౌతమ్‌నగర్‌లో కొడవలూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులు–వాటి నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం విశలమ్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలుషిత ఆహారం, నీటితో డయేరియా ప్రబలే అవకాశం ఉందన్నారు. వర్షాకాలంలో తాజా ఆహార పదార్థాలు, పరిశుభ్రమైన నీటిని తీసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తద్వారా డయేయాతోపాటు మలేరియా, తదితర వ్యాధులను దూరం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త అనిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



సర్టిఫికెట్లను అందుకున్న చిన్నారులు

ఇందుకూరుపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యలో భాగంగా మూడేళ్లలోపు చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుడి మంజుల తెలిపారు. మండలంలోని గంగపట్నం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యను పూర్తి చేసుకున్న ఐదేళ్లు నిండిన చిన్నారులను సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తున్నామని చెప్పారు. అనంతరం ప్రీస్కూల్ విద్యను పూర్తి చేసుకున్న 15 మంది చిన్నారులను సమీపంలోని ఒకటో తరగతిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్వరూప, చాముండేశ్వరి, రాజేశ్వరి, విజయ, రమణమ్మ, సుమ, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో డయేరియాకు కళ్లెం



రామన్నపాలెంలో గిరిజనులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ

కొడవలూరు: పరిశుభ్రత పాటించడం ద్వారా డయేరియాకు కళ్లెం వేయవచ్చని ఐసీడీఎస్ కోవూరు ప్రాజెక్ట్ సీడీపీఓ జ్యోతి సూచించారు. మండలంలోని రామన్నపాలెం గిరిజన కాలనీలో డయేరియా–నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశుభ్రమైన ఆహార పదార్థాలు, నీటిని తీసుకోవాలని సూచించారు. ఈగలు ముసిరిన, పాచిపోయిన ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోరాదని తెలిపారు. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల కారణంగా మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని తెలిపారు. దోమ కాటుకు గురవకుండా దోమతెరలను వినియోగించాలని సూచించారు. అనంతరం చేతులను శుభ్రపరచుకోవడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్త రోజా పాల్గొన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం

నగరంలో నానాటికీ పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ సమస్య జటిలమవుతోంది. ఇరుకైన రోడ్లు, ఆక్రమణలూ సమస్య తీవ్రతకు కారణమవుతున్నాయి. రామలింగాపురం సెంటర్‌లో వాహనాల రద్దీతో బుధవారం పలువురు ఇబ్బంది పడ్డారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





నిబంధనలు తుంగలో..

నిబంధనలకు ఆటోడ్రైవర్లు నీళ్లొదిలారు. పదుల సంఖ్యలో చిన్నారులను ఆటోలో కుక్కి పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. దీనిపై చర్యలు చేపట్టాల్సిన రవాణా, పోలీస్ శాఖలు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా వీటిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – నెల్లూరు(క్రైమ్)





వేడుకగా కుంభాభి షేక మహోత్సవాలు





హోమం



పూజలు చేస్తున్న వేదపండితులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో పుష్కర మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నారు. శ్రీదేవీ, భూదేవీ సమేత గురువాయూర్ మహావిష్ణు వారి మూలమూర్తులకు శిఖర కలశ ధ్వజస్తంభ విశేషారాధన, మహాప్రోక్షణ, శాత్తుమొర్రై తదితరాలను విశేషంగా బుధవారం జరిపారు. ఊంజల్‌సేవను రాత్రి నిర్వహించారు. తలమంచి వెంకటేశ్వరరావు, సునీత, సతీష్, రాధిక, డాక్టర్ నరసింహారెడ్డి, విజయ, మేడికొండ పద్మమోహన్, స్నేహ దంపతులు, ముంగమూరు కృష్ణచైతన్య, అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతను తప్పక పాటించాలి



మాట్లాడుతున్న హేనాసుజన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని మహిళా ప్రాంగణం, సేవాసదన్‌లో పరిశుభ్రతను తప్పక పాటించాలని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ పేర్కొన్నారు. వీటిని బుధవారం సందర్శించిన అనంతరం ఆమె మాట్లాడారు. పరిశుభ్రతను పాటించడంతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. సేవాసదన్‌లో కట్టెల పొయ్యిపై వంట చేస్తుండటాన్ని గుర్తించి, గ్యాస్‌ను వినియోగించాలని కోరారు. మెనూ మేరకు భోజనాన్ని అమలు చేస్తున్నారాననే అంశాన్ని ఆరాతీశారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మాధవి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్స పథకానికి విరాళం



నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ హాస్పిటల్లో నిర్వహిస్తున్న ఉచిత నేత్ర శస్త్రచికిత్స పథకానికి రూ.50 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. నగరానికి చెందిన పొన్నలూరు సీతారామిరెడ్డి, జ్యోతిరెడ్డి తమ కుమారుడు వినయ్‌రాఘవ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈ మొత్తాన్ని ఇచ్చారు. ఈ మొత్తంతో 25 మంది పేదలకు ఆపరేషన్లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మేనేజర్ గురుప్రసాద్ మాట్లాడారు. ఆపరేషన్‌కు రూ.రెండు వేల ఖర్చవుతుందని, దాతలు సాయం చేయాలని కోరారు. అనంతరం శస్త్రచికిత్స చేయించుకున్న వారికి మందులు, కళ్లద్దాలను అందజేశారు. డాక్టర్ శ్రీలక్ష్మి, ఆస్పత్రి డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

‘ఎనెల్’లో అరుదైన న్యూరో చికిత్స



మాట్లాడుతున్న లావణ్య

నెల్లూరు(అర్బన్): ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలను కాపాడామని ఎనెల్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరాలజిస్ట్ లావణ్య పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో వివరాలను బుధవారం ఆమె వెల్లడించారు. ఉలవపాడు మండలంలోని చాగొల్లుకు చెందిన 43 ఏళ్ల సారమ్మ గర్భ సంచి ఆపరేషన్‌ను చేయించుకున్నారని చెప్పారు. వారం అనంతరం తలనొప్పితో పాటు ఓవైపు చేయి చచ్చుబడి ప్రాణాంతక స్థితిలో తమ ఆస్పత్రికి వచ్చారని తెలిపారు. ఈ క్రమంలో ఆమె మెదడులోని ఒక సిర బ్లాకైందనే అంశాన్ని గుర్తించామని వివరించారు. దీంతో ఆమె బంధువులకు విషయాన్ని తెలియజేసి, ఐసీయూలో ఉంచి స్టిరాయిడ్ ఇంజెక్షన్ ఇచ్చి వైద్యాన్ని అందించామని చెప్పారు. ఐసీయూలో వైద్య సేవలందిస్తూ అత్యంత అధునాతన న్యూరోచికిత్స చేశామన్నారు. రోగి ప్రస్తుతం కోలుకున్నారని, డిశ్చార్జి చేయనున్నామని తెలిపారు. ఐసీయూ హెడ్ డాక్టర్ షఫీ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఏపీజేఏసీ ఉద్యోగ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలను అందజేసి మంత్రిని సత్కరించారు. ఏపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, మురళి, డానియెల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైలు తిరిగి జిల్లాకు..

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల వేళ జిల్లా నుంచి ఇతర జిల్లాలకు వెళ్లిన 13 మంది, అక్కడి నుంచి ఇక్కడికి వచ్చిన 16 మంది ర్యాంకర్ ఎస్సైలను గతంలో వారు పనిచేస్తున్న జిల్లాలకు తిరిగి కేటాయిస్తూ సౌత్ కోస్టల్ జోన్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా సొంత జిల్లాల్లో పనిచేస్తున్న ర్యాంకర్ ఎస్సైలను గుంటూరు రేంజ్‌లోని ఇతర జిల్లాలకు కేటాయించారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన ఎస్సైలు మస్తానయ్య, రాంబాబు, వెంకటాద్రినాయుడు, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు బాపట్ల జిల్లాకు.. సాయిప్రసాద్, బాలకృష్ణ, అబ్దుల్ రహీమ్, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, ఎడ్వర్డ్, రాములు, మాల్యాద్రి గుంటూరు జిల్లాకు వెళ్లారు. వీరందర్నీ తిరిగి నెల్లూరుకు కేటాయించారు.

ఇతర జిల్లాలకు..

గుంటూరు జిల్లాకు చెందిన కోటేశ్వరరావు, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, పెంచలయ్య, జోజీ, వెంకట్రావు, పల్నాడు జిల్లాకు చెందిన వీఆర్కే మూర్తి, మధుసూదన్‌రావు, బాపట్ల జిల్లాకు చెందిన మాణిక్యరావు, శ్రీనివాసులు, భాస్కర్‌రావు, జనార్దన్‌రావు, నాగేశ్వరరావు, రాంబాబు, రమాదేవిని తిరిగి వారి జిల్లాలకు కేటాయించారు.

29న జాబ్ మేళా

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జాబ్‌మేళాను ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ టెక్‌బీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నామని ఆర్ఐఓ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్‌బీ నాన్ మ్యాథమేటిక్స్ (సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, ఒకేషనల్) విద్యార్థులు జాబ్‌మేళాకు హాజరుకావొచ్చని చెప్పారు. ఇంటర్‌లో 75 శాతం ఉత్తీర్ణత ఉండాలని వివరించారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఆఫర్ లెటర్‌ను అందజేయనున్నారని పేర్కొన్నారు. మొదటి మూడు నెలలు మదురైలో క్లాస్ రూమ్ శిక్షణ ఉంటుందని, ఆ సమయంలో స్టయిపండ్‌గా రూ.పది వేలను అందజేయనున్నారని వెల్లడించారు. ఉద్యోగం పొందాక ఏడాదికి రూ.1.7 లక్షల వేతనాన్ని ఇవ్వనున్నారని, వివరాలకు 77803 23850 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నెల్లూరు(మినీబైపాస్): నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాను శనివారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు పేర్కొన్నారు. ఐమార్స్ సొల్యూషన్స్, అరబిందో ఫార్మసీ, నియోలెన్సీ, ఇంజినీరింగ్ వర్క్స్, మ్యాన్‌పవర్ సర్వీసెస్ కంపెనీల్లో ఉద్యోగాలు పొందేందుకు పదో తరగతి నుండి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ చదివిన వారు అర్హులని చెప్పారు. కాల్ సెంటర్ ఎగ్జిక్యూటివ్స్, మొబైల్ అసెంబ్లింగ్, స్కిల్డ్, అన్ స్కిల్డ్ ఉద్యోగాలకు గానూ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని, ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు.

లోక్‌సభ స్పీకర్‌కు అభినందన

నెల్లూరు(దర్గామిట్ట): లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ఎంతో అనుభవం ఉన్న ఆయన స్పీకర్‌గా ఎన్నికవ్వడం సంతోషంగా ఉందని చెప్పారు. సభను సమర్థంగా నిర్వహించేందుకు ఆయన కృషి చేస్తారని కాంక్షించారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రాహుల్

నెల్లూరు (టౌన్): ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రాహుల్ నియమితులయ్యారు. ఈ మేరకు తిరుపతిలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమశేఖర్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

ఆహార పొట్లాల అందజేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు ఆహార పొట్లాలను అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. దాతల సహకారంతో కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. రమేష్‌బాబు, కార్తికేయ, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెముడుగుంటలో 30న ఉచిత వైద్య శిబిరం

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న నెల్లూరుకు చెందిన ఎనెల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరంలో ప్రముఖ వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఎనెల్ ఆస్పత్రి నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

డ్రగ్స్‌కు అలవాటు పడితే అనర్థాలు



ర్యాలీలో అధికారులు

నెల్లూరు(అర్బన్): డ్రగ్స్‌కు అలవాటు పడితే అనర్థాలు సంభవిస్తాయని ఏడీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని దర్గామిట్టలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి వద్ద ర్యాలీని నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. డ్రగ్స్ వాడకంతో తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తాయని, ఈ క్రమంలో వీటికి దూరంగా ఉండాలని కోరారు. డీఏపీసీయూ సంస్థ ప్రతినిధి శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి



విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతున్న వక్తలు

కొడవలూరు: సీనియర్, జూనియర్ అన్న వ్యత్యాసం లేకుండా విద్యార్థులు సోదరభావంతో మెలగాలని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పీ గుణశేఖర్ సూచించారు. నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాలలో ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సోదరభావంతో మెలగడం ద్వారా ర్యాగింగ్ వంటి వికృత క్రీడలకు దూరంగా ఉండవచ్చని సూచించారు. అనంతరం ప్రిన్సిపల్ ప్రకాష్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిలారి మృతి తీరని లోటు

నెల్లూరు(దర్గామిట్ట): టీడీపీ నేత, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కిలారి వెంకటస్వామినాయుడు గుండెపోటుతో మృతి చెందడంపై రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కిలారి పార్థివదేహానికి నివాళులర్పించారు.

- కిలారి వెంకటస్వామినాయుడి మృతి టీడీపీకి తీరని లోటు అని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. వారి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నెల్లూరు సిటీ: కిలారి వెంకటస్వామినాయుడు మరణం బాధాకరమని మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కాంక్షించారు.

కృష్ణ జననంపై ప్రవచనలు



ఉపన్యసిస్తున్న కోట రాజశేఖర్

నెల్లూరు(బృందావనం): దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం భూమాత భారాన్ని తగ్గించేందుకు విష్ణు భగవానుడు కృష్ణుడిగా అవతరించారని అవధాని కోట రాజశేఖర్ తెలిపారు. కృష్ణ కథామృతం భాగవత సప్తాహంలో భాగంగా కృష్ణ జననంపై బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో బుధవారం ఆయన ఉపన్యసించారు. దేవరకొండ చిన్నికృష్ణశర్మ రచించిన వాల్మీకి రామాయణం తెలుగు వచనానువాదాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజశేఖర్‌ను సత్కరించారు. సభా పోషకుడిగా నలుబోలు బలరామయ్యానాయుడు వ్యవహరించారు. పద్యసారస్వత పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు పోలవరపు లక్ష్మీనరసింహారావు, డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు, ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, డాక్టర్ ప్రసాద్, అన్నవరం సత్యనారాయణ, కోట శ్రీరామ్మూర్తి, చక్కిరాల జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



కొడవలూరు: యల్లాయపాళెంలో ర్యాలీ

కొడవలూరు: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, చిన్నారులు బడికి వెళ్లి చదువుకోవాలని యల్లాయపాళెం హైస్కూల్ హెచ్ఎం మోహనరామలింగయ్య సూచించారు. మండలంలోని యల్లాయపాళెం మెయిన్, ఉర్దూ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులతో ‘నేను బడికి పోతా’పై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిహేనేళ్లలోపు పిల్లలంతా విధిగా పాఠశాలలోనే ఉండాలన్నారు. ప్రతి చిన్నారి చదువుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే నేను బడికి పోతా కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పైసా ఖర్చులేకుండా ఉన్నత చదువులు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని వివరించారు. హెచ్ఎంలు వై శ్రీలత, ఎస్కే ఖాజా రసూల్, ఉపాధ్యాయులు నరహరి, నూర్జహాన్‌బేగం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

- రామాపురం గిరిజన కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాధవి మాట్లాడుతూ.. బడిఈడు పిల్లలు బడి బయట ఉన్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. తద్వారా పిల్లల జీవితాలను మెరుగుపరచవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని సుహాసిని రేచల్, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటాచలం: బడి మానేసిన పిల్లలను తప్పనిసరిగా బడికి పంపి చదివించేలా తల్లిదండ్రులు ఆలోచన చేయాలని ఎంఈఓ–1 మధుసూదన్ అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కురిచెర్లపాడులో బడి మానేసిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులతో మాట్లాడారు. బడికి వెళ్లాల్సిన పిల్లలను పనులకు పంపితే వారి భవిష్యత్ దెబ్బతింటుందని తెలియజేశారు. చదువు పిల్లలకు సమాజం గురించి పూర్తిగా తెలుసుకునే అవకాశం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ – 2 శ్రీనివాసులురెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.